కొలువుకు తొలి అస్త్రం!

దరఖాస్తు మెలకువలు

కరిక్యులమ్ వీటే (సీవీ) అంటే లాటిన్‌లో 'కోర్స్ ఆఫ్ లైఫ్' (జీవిత గమనం) అని అర్థం. రెజ్యూమెకు ఫ్రెంచి సమానార్థకం 'సమ్మరీ' (సారాంశం). నిర్దిష్ట ఉద్యోగానికి/ నియామక సంస్థకు దరఖాస్తు చేయటానికి ఉద్దేశించినవే ఈ రెండూ! మేటి అర్హతలున్న అభ్యర్థులుగా మనల్ని చూపటానికీ, మౌఖిక పరీక్షకు ఆహ్వానం అందేలా చేయటానికీ సీవీ/ రెజ్యూమె ఉపయోగపడుతుంది. ఈ అస్త్రాన్ని ఎలా రూపొందించి, సంధించాలో తెలుసుకుందాం!

తొలిచూపులోనే మీ కీలక సమాచారాన్ని నియామక సంస్థలకు తెలిసేలా చేస్తుంది ఉద్యోగ దరఖాస్తు. మీ గురించి సత్వర అంచనాకు వచ్చేలా చేసి, ఇంటర్వ్యూకు మార్గం సుగమం చేస్తుంది.

- రెజ్యూమె ప్రధానంగా అభ్యర్థి నైపుణ్యాలను ప్రతిఫలిస్తుంది. నిడివి సాధారణంగా రెండు, మూడు పేజీలు మించదు. పరిశ్రమ, ప్రభుత్వ రంగాల కొలువుల్లో చేరటానికి ఇది సాధనం.
- సీవీ ముఖ్యంగా విద్యాపరమైన విజయాలకు అద్దం పడుతుంది. అకడమిక్ హోదాలూ, ఫెలోషిప్‌లూ, గ్రాంట్లకు దరఖాస్తు చేసేటప్పుడు ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. అనుభవం, పబ్లికేషన్లు, ప్రెజెంటేషన్లను బట్టి దీని నిడివి ఎన్ని పేజీలన్నది ఆధారపడి ఉంటుంది.

మొక్కుబడి వ్యవహారం తగదు

కొంతమంది మొక్కుబడిగా సీవీని తయారుచేస్తారు. ఒకసారి రాసి కొన్ని జిరాక్స్ కాపీలు తీసుకుని.. ఏ ఉద్యోగానికి దరఖాస్తు చేసినా దాన్నే పంపేస్తుంటారు. సీవీ రాయడాన్ని ఓ బలవంతపు వ్యవహారంలా భావించడమే అందుకు కారణం కావొచ్చు. ఉద్యోగం చేయడానికి మీరెంతో ఆసక్తితో ఉన్నారనే విషయం ఎదుటివారికి తెలియాలంటే ఇలాంటివి చేయకూడదు. నిజానికి నియామక సంస్థలకు సంబంధించిన అధికారులు ఏడు సెకన్లపాటు మాత్రమే సీవీని చదువుతారని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. కాబట్టి అంత తక్కువ వ్యవధిలోనే చదివినవారికి మీపై సదభిప్రాయం కలిగేలా సీవీని రూపొందించాలి.

సుదీర్ఘంగా ఉండకూడదు

సీవీని ఎంత పెద్దగా తయారుచేస్తే అంత మంచిదని కొందరు పొరబడుతుంటారు. దాంతో పేజీలను అనవసర సమాచారంతో నింపేస్తుంటారు. ప్రతి చిన్న అనుభవాన్నీ, ఆలోచననూ దాంట్లోనే జోడించాలని ఆరాటపడుతుంటారు. ఇది ఎంత మాత్రం సరికాదు. సీవీ ఎప్పుడూ రెండు, మూడు పేజీలకు మించకుండా జాగ్రత్తపడాలి. అతి ముఖ్యమైన విషయాలను ఆకట్టుకునేలా రాస్తే సరిపోతుంది. కుడిపక్క మార్జిన్ లాంటి స్థలంలో ఈమెయిల్ ఐడీ, కాంటాక్ట్ నంబర్, అడ్రస్, విద్యార్హతలు, నైపుణ్యాలు, మధ్యన ఉండే ఖాళీ స్థలంలో ఉద్యోగానుభవాలను రాస్తే.. చూడ్డానికీ, చదవడానికీ సౌకర్యంగా ఉంటుంది. లేదా ఎడమపక్క మార్జిన్ స్థలంలో వ్యక్తిగత వివరాలను రాసి పేపర్ మధ్యలో ఉద్యోగానుభవాలను రాసినా ఫర్వాలేదు. రెండు పద్ధతుల్లో దేన్ని ఎంచుకున్నా చూడ్డానికి ఆకర్షణీయంగా ఉండేలా తీర్చిదిద్దడమే మీ ధ్యేయం కావాలి.

గజిబిజిగా వద్దు

కొంతమంది సీవీ మిగతావారి కంటే భిన్నంగా, వినూత్నంగా ఉండాలని ఆరాటపడుతుంటారు. అందుకోసం రకరకాల డిజైన్లు, ఫాంట్లను ప్రయత్నిస్తారు. నిజానికి డిజైన్లూ, రంగులూ ఎక్కువైనా, ఫాంట్లు గజిబిజిగా ఉన్నా చదివేవారికి ఇబ్బందే. అందుకే చదవడానికి వీలుగా, కళ్లకు హాయిగా ఉండే ఏరియల్, కాలిబ్రి లాంటి ఫాంట్లను మాత్రమే ఎంపిక చేసుకోవాలి. మీకూ, ఉద్యోగం ఇవ్వబోయే సంస్థకూ మధ్య వారధిలా ఉండే వ్యక్తి.. చదవడానికి ఏమాత్రం ఇబ్బందిపడకుండా సీవీని రూపొందించాల్సిన బాధ్యత మీదే. వినూత్నంగా తయారుచేయడం కంటే విషయాలను ఆకట్టుకునేలా చెప్పడమే ముఖ్యం.

ఏది ముందు

ఉద్యోగానుభవాలు అన్నింటినీ ఒకే పేరాలో చెప్పేయాలని తాపత్రయపడకూడదు. ఇలాచేయడం వల్ల చదివేవారికి కాస్త గందరగోళంగా ఉండొచ్చు. ఉదాహరణకు చదువు పూర్తయిన వెంటనే మీరొక సంస్థలో ఉద్యోగంలో చేరారు. శిక్షణకాలం పూర్తికాగానే మరో పెద్ద సంస్థలోకి మారారు. అక్కడ కొంతకాలం పనిచేసిన తర్వాత ఆకర్షణీయమైన వేతనం కోసం మరో సంస్థలోకి వెళ్లారు. ఆ తర్వాత.. విదేశాలకు వెళ్లే అవకాశం ఉంటుందని మరో సంస్థలోకి మారారు. మూడుచోట్లా వేర్వేరు ఉద్యోగాలు చేశారు. వాటన్నింటినీ ఒకే పేరాలో చెప్పాలని ప్రయత్నిస్తే అంతా గందరగోళంగా తయారవుతుంది. అలాకాకుండా ప్రస్తుతం మీరు ఏ ఉద్యోగం చేస్తున్నారు, ఎలాంటి బాధ్యతలను నిర్వర్తిస్తున్నారో ముందుగా చెప్పాలి. ఆ తర్వాత సంవత్సరాలవారీగా.. ఎప్పుడు, ఎక్కడ పనిచేసింది, ఏయే బాధ్యతలను నిర్వర్తించింది పాయింట్ల రూపంలో రాస్తే బాగుంటుంది.

ఈమధ్యే చదువు పూర్తిచేసిన వాళ్లకు ఉద్యోగానుభవం ఉండదు. కాబట్టి ప్రస్తుతం ఉన్నత విద్యను అభ్యసించడం లేదా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడం కోసం శిక్షణ తీసుకోవడం.. లాంటివి చేస్తుంటే ఆ విషయాలనూ ప్రస్తావించాలి. దీని ద్వారా సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ.. నైపుణ్యాలను పెంచుకుంటున్న మీ గురించి సదభిప్రాయం కలిగే అవకాశం ఉంటుంది.

అభిరుచులకూ చోటు

విద్యార్హతలు, పనిచేసిన అనుభవాల గురించి వివరించడం వరకూ బాగానే ఉంటుంది. మరి అభిరుచుల గురించి చెప్పాలా.. వద్దా? నిపుణుల అభిప్రాయం ప్రకారం వీటి గురించి చెప్పడం అవసరమే. అయితే నైపుణ్యాలను పెంచుకోవడానికి తోడ్పడే అభిరుచులు మీకుంటే ఇంకా మంచిది. ఉదాహరణకు ఎప్పటికప్పుడు కొత్త విషయాలను తెలుసుకోవడం మీ హాబీ అనుకుందాం. మీకున్న ఈ వ్యక్తిగత అభిరుచి వృత్తి జీవితంలో ఎదుగుదలకూ తోడ్పడుతుంది. ఎందుకంటే నిరంతరం నేర్చుకోవాలనే ఆసక్తి ఉండే ఉద్యోగులు.. సంస్థకు విలువైన మానవ వనరు కాగలుగుతారు. రోజురోజుకూ మారిపోతున్న సాంకేతికతను అందిపుచ్చుకోవాలంటే.. కొత్త విషయాలను నేర్చుకోవాలనే ఆసక్తి ఉండే ఉద్యోగులు ఎంతో అవసరం. ఉద్యోగ విధులను నిర్వర్తించే తీరులో ఎన్నో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని మరింత వేగంగా, సమర్థంగా బాధ్యతలను నిర్వర్తించాల్సి వస్తుంది. కొత్త విషయాలను నేర్చుకోవాలనే అభిరుచి మీకుంటే.. మారుతున్న సాంకేతికతనూ త్వరగా అందిపుచ్చుకుంటారు. కేటాయించిన పనులను వేగంగా పూర్తిచేస్తారు. అయితే ఇక్కడో విషయాన్ని గుర్తుంచుకోవాలి- విలువైన కాలాన్నీ, డబ్బునూ వృథాచేసే అభిరుచులు మీకుంటే.. వాటి గురించి ప్రస్తావించకపోవడమే మంచిది.

కవర్ లెటర్

సీవీ ఆకట్టుకునేలా ఉండాలంటే కవర్ లెటర్‌నూ జతచేయాలి. దీంట్లో ముందుగా దరఖాస్తు చేస్తున్న ఉద్యోగం పేరు, ఉద్యోగ ప్రకటన వెలువడిన తేదీని ప్రత్యేకంగా రాయాలి. ఆ తర్వాత సీవీలో ప్రస్తావించని విషయాల గురించి దీంట్లో రాయొచ్చు. రాసే క్రమంలో అక్షర, అన్వయ దోషాలు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. కఠినమైన పదాలను ఉపయోగించకుండా చెప్పాలనుకుంటున్న విషయాన్ని నులువుగా, ఆసక్తిగా వ్యక్తీకరించగలగాలి.

ఎవరిని ఉద్దేశించి లెటర్‌ను రాస్తున్నారో ఆ వ్యక్తి పేరు, హోదా ఒకసారి చెక్ చేసుకోవాలి. కంపెనీ పేరు, దరఖాస్తు చేసే ఉద్యోగ హోదా విషయంలో తప్పులు దొర్లకుండా చూసుకోవాలి. ఇలాంటి ముఖ్యమైన విషయాల్లో కనీస జాగ్రత్తలు తప్పనిసరి. కంపెనీ పేరు విషయంలో ఏమైనా సందేహాలుంటే వెబ్‌సైట్ చూసుకుని రాయడం మంచిది. భాష మీద మీకెంత పట్టున్నా సరే లెటర్‌ను పంపేముందు ఒకసారి సరిచూసుకోవాలి. పదాలు పునరావృతం కాకుండా జాగ్రత్తపడాలి. కవర్ లెటర్ కాపీని మీ దగ్గర పదిలపరుచుకోవాలి. ఎందుకంటే దీంట్లో ప్రస్తావించిన అంశాల గురించి ఇంటర్వ్యూ సమయంలో అడిగే అవకాశం ఉంటుంది. కొంతమంది పోస్టు పేరు దగ్గర ఖాళీ వదిలి.. లెటర్‌ను జిరాక్స్ కాపీలు తీసుకుని సిద్ధంగా ఉంచుకుంటారు. తర్వాత ఆ ఖాళీని పూరిస్తుంటారు. ఇది సరికాదు. అన్ని ఉద్యోగాలకూ ఒకే విధమైన విధులు ఉండవు. ఉద్యోగాలను బట్టి చేయాల్సిన పనులూ మారుతుంటాయి. కాబట్టి ఎప్పటికప్పుడు లెటర్‌ను సిద్ధం చేసుకోవడమే సమంజసం.

ఖాళీ... వస్తే!

రెజ్యూమె.... ఎదుటివారికి మనపై కలిగే తొలి అభిప్రాయం. అది ఎంత పాజిటివ్ కోణంలో ఉంటే... మన పని అంత సులువుగా జరుగుతుంది. అయితే ఇందులో అకడమిక్ గ్యాప్ లేదా ఉద్యోగం దొరక్క ఖాళీగా ఉన్న సమయం మనల్ని కాస్త ఇబ్బంది పెట్టే అంశం. దీనికి సంబంధించి ప్రశ్నలు ఎదుర్కొనే సమయంలో ఏం చేయాలంటే...



ఏదైనా ముఖాముఖి పరీక్షకు హాజరయ్యేటప్పుడు... విద్యార్థిగానైనా, ఉద్యోగంలో చేరాక అయినా ఏడాది, రెండేళ్లు ఖాళీగా ఉన్నట్లు కనిపిస్తే... అది అవతలివారిని మనపట్ల ఆలోచనలో పడేస్తుంది. మనకిచ్చే అవకాశాన్ని ప్రభావితం చేస్తుంది. అయితే కొన్నిసార్లు ఈ విరామం అనివార్యంగా వస్తుంటుంది. అందుకే దీనికి సంబంధించిన ప్రశ్నలకు కొంత ఆలోచించి సమాధానాలు ఇవ్వాలి. అప్పుడే మనకు రావాల్సిన అవకాశంపై ఎటువంటి దుష్ప్రభావం పడకుండా జాగ్రత్త పడొచ్చు.

▼ ఇటువంటి సమయాల్లో మొట్టమొదట చేయాల్సిన విషయం ఆ ఖాళీ గురించి నిజాయతీగా చెప్పడం. రెజ్యూమెలోనైనా, నేరుగానైనా గ్యాప్ గురించి పూర్తిగా నిజమే చెప్పాలి. అదే సమయంలో మీరు కొత్త విషయాలు నేర్చుకోవడం ఎక్కడా ఆపలేదు అనే అంశాన్ని స్పష్టం చేయాలి. మీకున్న అదనపు నైపుణ్యాలను ప్రస్తావిస్తూ, ఆ సమయాన్ని సద్వినియోగం చేసుకున్నామనే భావన కల్పించవచ్చు. ఎట్టిపరిస్థితుల్లోనూ అబద్ధం చెప్పడానికి ప్రయత్నించకూడదు. కంపెనీ వారు కనుక్కోవాలి అనుకుంటే వాస్తవం ఎలాగయినా తెలిసిపోతుందనే విషయాన్ని గ్రహించాలి. అందువల్ల నిజాయతీగా ఉండటమే మంచిది.

▼ ఈ ఖాళీకి కారణాలు చెప్పాల్సి వస్తే... కుటుంబ కారణాలు, అనారోగ్యం, గాయాలు, మీకు నచ్చిన చదువు - ఉద్యోగం ఏదో గుర్తించడానికి ప్రయత్నం చేయడం, ఏదైనా వ్యాపారం నడపడం వంటివన్నీ చెప్పొచ్చు. ఇంతకంటే వేరే కారణాలు చెప్పేటప్పుడు మాత్రం జాగ్రత్తగా ఆలోచించాలి.

▼ ఖాళీలపై అంతగా ఫోకస్ చేయని విధంగా ఉండే రెజ్యూమె ఫార్మాట్లను ఎంచుకోవడం ఉత్తమం. అప్పుడు ఇంటర్వ్యూ చేసే వ్యక్తి దాన్ని గుర్తించేందుకు, గుర్తించినా ప్రశ్నించేందుకు అవకాశం తక్కువగా ఉంటుంది.

ఖాళీగా ఉండటంకంటే కూడా, దాన్ని మనం ఎలా వివరించామనే దాన్ని బట్టే అవతలివారి అభిప్రాయం ఆధారపడి ఉంటుంది. అందువల్ల ఖాళీకి కారణం ఏదైనా పాజిటివ్ కోణంలో చెప్పేందుకు, సరైన కారణాలు ఇచ్చేందుకు ప్రయత్నించాలి.

▼ ఈ ఖాళీలు 'వీరు తరచూ జాబ్ వదిలి వెళ్లిపోతున్నారు' అని అనుకోవడానికి ఆధారం కాకూడదు. అలాంటివారిని ఉద్యోగంలోకి తీసుకుంటే శిక్షణ ఇచ్చి సమయాన్ని వృథా చేసుకోవడం అని కంపెనీలు భావిస్తాయి. అందువల్ల మనం ఎక్కడైనా స్థిరంగా పనిచేయగలుగుతాం అనే భావన కల్పించాలి.

చక్కని డిగ్రీ, మెరుగైన మార్కులు, ఆకట్టుకునే ప్రతిభ ఉంటే... సమయం విరామం అనేది పెద్ద విషయంగా కనిపించదు. తాజాగా ఎటువంటి ఖాళీ ఉన్నా, దాన్ని నిజాయతీగా ఒప్పుకుని, సరైన విధంగా వివరిస్తే.. అనుకున్న అవకాశాన్ని అందిపుచ్చుకోవచ్చు.

▼ అలాగే ఈ ప్రశ్న ఎదురుకాగానే తడబడటం, జవాబు కోసం తడుముకోవడం వంటివి చేయకూడదు. ముందే అడుగుతారనే విషయాన్ని గమనించి తగిన విధంగా జవాబుతో సన్నద్ధం కావాలి.

తాజా ఇంటర్న్‌షిప్‌లు

హైదరాబాద్‌లో

రోబోటిక్స్ అండ్ కోడింగ్
సంస్థ: ఇన్‌స్టిన్
స్టైపెండ్: నెలకు రూ.15,000
దరఖాస్తు గడువు: అక్టోబరు 5
అర్హతలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్ నైపుణ్యం
internshala.com/i/8058bb

డిజిటల్ మార్కెటింగ్
సంస్థ: ఎవన్‌ఫిక్స్
స్టైపెండ్: నెలకు రూ.5,000-15,000
దరఖాస్తు గడువు: సెప్టెంబరు 29
అర్హతలు: క్రియేటివ్ రైటింగ్, డిజిటల్, ఈమెయిల్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ మార్కెటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడంలో నైపుణ్యం
internshala.com/i/14ffb8

ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ క్రియేషన్
సంస్థ: మట్కా పుడ్స్ ఎంటర్‌ప్రైజ్
స్టైపెండ్: నెలకు రూ.15,000
దరఖాస్తు గడువు: అక్టోబరు 1
అర్హతలు: కేన్వా, ఇన్‌స్టాగ్రామ్ మార్కెటింగ్, వీడియో ఎడిటింగ్ నైపుణ్యాలు
internshala.com/i/5a3c14

ట్యాలీ అండ్ అకౌంటింగ్
సంస్థ: లీవరేజ్ సైన్స్ అండ్ టెక్నాలజీస్
స్టైపెండ్: నెలకు రూ.15,000
దరఖాస్తు గడువు: అక్టోబరు 1
అర్హతలు: అకౌంటింగ్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, రిపోర్ట్ రైటింగ్, ట్యాలీ నైపుణ్యాలు
internshala.com/i/b488d8

ఈ-కామర్స్ ఆపరేషన్స్
సంస్థ: జాగ్‌జీ ఎంటర్‌ప్రైజెస్ (న్యూట్రాజీ)
స్టైపెండ్: నెలకు రూ.10,000
దరఖాస్తు గడువు: అక్టోబరు 1
అర్హతలు: అడ్వాన్స్‌డ్ ఎక్సెల్, ఎంఎస్-ఎక్సెల్, ఆపరేషన్స్ నైపుణ్యాలు
internshala.com/i/af966f

విశాఖపట్నంలో

సోషల్ మీడియా మార్కెటింగ్
సంస్థ: క్లౌడ్‌ఐ టెక్నాలజీస్ ఇండియా
స్టైపెండ్: నెలకు రూ.8,000-10,000
దరఖాస్తు గడువు: అక్టోబరు 13
అర్హతలు: అడోబ్ ఫొటోషాప్, క్రియేటివ్ రైటింగ్, డిజిటల్, ఫేస్‌బుక్ మార్కెటింగ్, గూగుల్ యాడ్‌వర్డ్స్ నైపుణ్యాలు
internshala.com/i/fd73e7

ఇంటీరియర్ డిజైన్
సంస్థ: ఎస్‌జే ఇంటీరియర్స్ డీ ఎన్ డీ
స్టైపెండ్: నెలకు రూ.3,500
దరఖాస్తు గడువు: సెప్టెంబరు 30
అర్హతలు: ఆటోక్యాడ్, స్కెచింగ్ నైపుణ్యాలు
internshala.com/i/2813cd

వైజాగ్, హైదరాబాద్, విజయవాడల్లో

గ్రాఫిక్ డిజైన్ అండ్ రీల్ మేకింగ్
సంస్థ: మార్క్‌అప్
స్టైపెండ్: నెలకు రూ.10,000
దరఖాస్తు గడువు: అక్టోబరు 4
అర్హతలు: అడోబ్ క్రియేటివ్ సూట్, ఫొటోషాప్, ప్రీమియర్ ప్రో, కేన్వా, యూఐ అండ్ యూఎక్స్ డిజైన్, వీడియో ఎడిటింగ్ అండ్ మేకింగ్ నైపుణ్యాలు
internshala.com/i/fc3fab

విజయవాడలో

చార్టర్డ్ అకౌంటెన్సీ
సంస్థ: అరిహంత్ ఎంటర్‌ప్రైజెస్
స్టైపెండ్: నెలకు రూ.10,000-20,000
దరఖాస్తు గడువు: అక్టోబరు 5
అర్హతలు: అకౌంటింగ్, ట్యాలీ
internshala.com/i/4bc35b

హ్యూమన్ రిసోర్సెస్ (హెచ్‌ఆర్)
సంస్థ: పింక్‌మూన్ టెక్నాలజీస్
స్టైపెండ్: నెలకు రూ.10,000
దరఖాస్తు గడువు: సెప్టెంబరు 30
అర్హతలు: ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-ఆఫీస్, ఎంఎస్-వర్డ్
internshala.com/i/6f8c16

మీకు మీరే నచ్చడం లేదా?

రమ్య ఎంత బాగా చదువుతుందో.. ప్రతి సబ్జెక్టులోనూ తనకే ఫస్ట్ వస్తుంది. పృథ్వీ క్రికెట్ భలే ఆడతాడు.. ఈమధ్య జాతీయస్థాయి పోటీలకు కూడా ఎంపికయ్యాడు. అనిత బాపూ బొమ్మలా ఎంత బాగుంటుందో చెప్పలేం ... ఇలా ఎంతసేపూ ఎదుటివారిలోని సుగుణాలే మీకు కనిపిస్తుంటాయి. వాళ్లే మీకు బాగా నచ్చుతారు. కానీ మీలో మీకు మాత్రం.. మంచి కంటే చెడే ఎక్కువగా కనిపిస్తుంటుంది. దాంతో మీకు మీరే నచ్చరు.

దీనికి చాలా కారణాలు ఉండొచ్చు. ఇతరుల్లా అందంగా, ఆకర్షణీయంగా లేరనీ, బాగా చదవలేకపోతున్నారనీ, లక్ష్యాలను సాధించలేకపోయారనీ.. ఇలా అనేక రకాల కారణాలతో మిమ్మల్ని మీరు యథాతథంగా అంగీకరించలేరు. ఈ 'సెల్ఫ్ యాక్సెప్టెన్స్' లేకపోవడం వల్ల అనేక అనర్థాలు వస్తుంటాయి. ముఖ్యంగా ఆత్మన్యూనతకూ గురవుతుంటారు. ఆత్మవిశ్వాసం లేకపోవడంతో అనుకున్నది సాధించనూ లేరు.

● మిమ్మల్ని మీరు అంగీకరించలేకపోవడానికి పొరపాట్లూ ఒక కారణమే. ఉదాహరణకు బాగా చదివి మంచి మార్కులు సాధించాలనే లక్ష్యాన్ని పెట్టుకున్నారనుకుందాం. కానీ మీరు చేసిన కొన్ని తప్పుల వల్ల దాన్ని సాధించలేకపోయారు. దీంతో మీరు ఎందుకూ పనికిరారని దిగులుపడిపోతుంటారు. కావాలని ఎవరూ వీటిని చేయాలనుకోరు. మీరూ అంతే. కొన్ని కారణాల వల్ల మీరు అనుకున్నది అనుకున్నట్లుగా జరగకపోవచ్చు. అంతమాత్రాన మిమ్మల్ని మీరు నిందించుకోవడం సరి కాదు.

● మంచి ర్యాంకు సాధించి.. దేశంలోని ప్రసిద్ధ విశ్వవిద్యాలయంలో సీటు సంపాదించాలనుకున్నారు. కానీ ఒక సబ్జెక్టులో పాస్‌మార్కులు కూడా రాలేదు. దాంతో ఇక ప్రతి విషయంలోనూ ఫలితాలు ఇలాగే ఉంటాయనుకుంటారు. వాస్తవానికి ప్రతికూల ఫలితమనేది ముందడుగు వేయడానికి అవరోధంగానూ మారుతుంది. ఆత్మస్థైర్యాన్నీ దెబ్బతీస్తుంది. దాంతో అప్పటినుంచీ మిమ్మల్ని మీరు పరాజితగా చూడటం మొదలుపెడతారు.

● మీకెంతో ఇష్టమైన క్రీడలో రాణించాలనుకుంటారు. పట్టుదలగా కృషి చేసి పోటీకి వెళతారు. కానీ ప్రాథమిక స్థాయిలోనే తిరస్కరణకు గురవుతారు. దాంతో అప్పటివరకూ ఆ క్రీడ మీద ఉండే ఇష్టాన్ని కాస్తా అయిష్టంగా మార్చేసుకుంటారు. మీకిక దాంట్లో భవిష్యత్తే ఉండదనే అభిప్రాయానికి వచ్చేస్తారు. లేదా ఇంటర్వ్యూలో మీరు ఎంపిక కాకుండా.. మీ స్నేహితులు సెలక్ట్ కావొచ్చు. అప్పుడూ మీకు మీరు నచ్చరు. మిమ్మల్ని మీరు నిందించుకోవడం మొదలుపెట్టేస్తారు.

● మిమ్మల్ని మీరు యథాతథంగా అంగీకరించలేకపోవడానికి ఒక్కోసారి విమర్శలూ కారణం కావొచ్చు. అయితే వాటికి మీరెలా స్పందిస్తారనేదే ముఖ్యం. మీరు తిరిగి అదేపని చేస్తారా, మౌనంగా ఉండిపోతారా అనేది మీ మీదే ఆధారపడి ఉంటుంది. అలాగే మిమ్మల్ని ఇబ్బందిపెట్టాలనే ఉద్దేశంతోనే కొందరు పనిగట్టుకుని మరీ విమర్శిస్తుంటారు. వాటిని పదేపదే తలచుకుని బాధపడటం వల్ల వారి ఉద్దేశం నెరవేరినట్టు అవుతుంది. ఇలాకాకుండా అది ఎంతవరకూ సరైందో తెలుసుకుని.. అందుకు అనుగుణంగా మిమ్మల్ని మీరు మార్చుకోవడానికి ప్రయత్నించొచ్చు. ఇక్కడో విషయాన్ని గమనించాలి. ప్రముఖుల నుంచి సామాన్యుల వరకూ ఎవరూ విమర్శలకు అతీతులు కారు. ఇంకా చెప్పాలంటే.. ప్రముఖులకు వీటి తాకిడి మరింత ఎక్కువ కూడా. అయితే వీటిని పట్టించుకునే తీరిక వాళ్లకు ఉండదు. ఇక మనలాంటి సామాన్యుల విషయానికి వస్తే.. వాటికి మనమెలా స్పందిస్తామనేది మన విజ్ఞత మీదే ఆధారపడి ఉంటుంది.

'తరిమే వాళ్లని హితులుగ తలచి ముందు కెళ్లాలని' సానుకూలంగా స్పందించారనుకోండి.. మిమ్మల్ని మీరేకాదు.. అందరూ అంగీకరిస్తారు. పొరపాట్లూ, వైఫల్యాలూ, విమర్శలూ, తిరస్కరణకు గురికావడం.. ఇవేమీ మిమ్మల్ని మీరు నిందించుకునేలా చేయకూడదు. మీ ఆలోచనా ధోరణినీ, గమనాన్నీ మార్చుకూడదని గుర్తుంచుకోవాలి.

నోటిఫికేషన్స్

ఉద్యోగాలు

తెలంగాణ గిరిజన గురుకులంలో ఫ్యాకల్టీ

తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ తాత్కాలిక ప్రాతిపదికన సిరిసిల్లలోని టీటీడబ్ల్యూఆర్ ఫైన్ ఆర్ట్స్ అకాడమీలో ఫ్యాకల్టీ (లెక్చరర్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ఫ్యాషన్ డిజైన్
- ఇంటీరియర్ డిజైన్
- ఫొటోగ్రఫీ
- కంప్యూటర్ సైన్స్

అర్హత: సంబంధిత సబ్జెక్టులో పీజీ.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 10-10-2023.
వెబ్‌సైట్: https://www.ttwrdcs.ac.in

సిపెట్, భోపాల్‌లో లెక్చరర్‌లు

భోపాల్‌లోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోకెమికల్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సిపెట్) ఒప్పంద ప్రాతిపదికన 5 లెక్చరర్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మెకానికల్ ఇంజినీరింగ్- 01
- కెమిస్ట్రీ- 1
- మ్యాథ్స్- 1
- ప్లాస్టిక్స్/ పాలిమర్- 01
- ఇంగ్లిష్- 1

అర్హత: సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీతో పాటు పని అనుభవం.
దరఖాస్తు: దరఖాస్తులను 'ది ప్రిన్సిపల్, డైరెక్టర్ అండ్ హెడ్, సిపెట్-భోపాల్, జి-సెక్టార్, భోపాల్' చిరునామాకు రిజిస్టర్డ్/ స్పీడ్ పోస్టు ద్వారా పంపాలి.
ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 07-10-2023.
వెబ్‌సైట్: https://www.cipet.gov.in

సిపెట్, భువనేశ్వర్‌లో..

భువనేశ్వర్‌లోని సిపెట్ ఒప్పంద ప్రాతిపదికన కింది ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- లెక్చరర్ (ప్లాస్టిక్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ)- 1
- లెక్చరర్ (మ్యాథ్స్)- 1
- లెక్చరర్ (ఇంగ్లిష్)- 1
- ప్లేస్‌మెంట్ కన్సల్టెంట్- 1

అర్హత: సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీతో పాటు పని అనుభవం.
దరఖాస్తు: ఆఫ్‌లైన్ దరఖాస్తులను 'ది ప్రిన్సిపల్, డైరెక్టర్ అండ్ హెడ్, సిపెట్- భువనేశ్వర్, ఎ-సెక్టార్, జోన్-బి, మంచేశ్వర్ ఇండస్ట్రియల్ ఎస్టేట్, భువనేశ్వర్ ' చిరునామాకు రిజిస్టర్డ్/ స్పీడ్ పోస్టు ద్వారా పంపాలి.
ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 09-10-2023.
వెబ్‌సైట్: https://www.cipet.gov.in

మాతృశ్రీ ఎడ్యుకేషన్ సొసైటీలో టీచింగ్ పోస్టులు

హైదరాబాద్ సైదాబాద్‌లోని మాతృశ్రీ ఎడ్యుకేషన్ సొసైటీ కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ప్రొఫెసర్
- అసోసియేట్ ప్రొఫెసర్
- అసిస్టెంట్ ప్రొఫెసర్

విభాగాలు: సీఎస్ఈ, సీఎస్ఈ (ఏఐఎంఎల్), సీఎస్ఈ (డీఎస్), సీఎస్ఈ (సైబర్ సెక్యూరిటీ), కంప్యూటర్ ఇంజినీరింగ్, ఐటీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లిష్, మ్యాథమెటిక్స్ **అర్హత:** పీజీ, పీహెచ్‌డీ.
దరఖాస్తు పంపాల్సిన ఈ-మెయిల్: recruitment@matrusri.edu.in
దరఖాస్తుకు చివరి తేదీ: 02-10-2023.
వెబ్‌సైట్: https://matrusri.edu.in/society/

అన్నమాచార్య కాలేజీలో ..

కడప జిల్లా రాజంపేట న్యూ బోయనపల్లిలోని అన్నమాచార్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ టీచింగ్, నాన్ టీచింగ్‌పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.:

- ప్రొఫెసర్
- అసోసియేట్ ప్రొఫెసర్
- అసిస్టెంట్ ప్రొఫెసర్

విభాగాలు: సీఎస్ఈ, సీఎస్ఈ (ఏఐ), సీఎస్ఈ (డీఎస్), ఏఐ/ డీఎస్, ఏఐ/ ఎంఎల్, ఈఈఈ, ఈసీఈ, సివిల్, ఫిజిక్స్, ఎంబీఏ, ఎంసీఏ, సైకియాట్రీ, పీడీ కమ్ యోగా ట్రైనర్.

- **నాన్ టీచింగ్ పోస్టులు:** సీఏ, అకౌంటెంట్.

అర్హత: డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 02-10-2023.
వెబ్‌సైట్: https://aitsrajampet.ac.in/recruitment

వాక్-ఇన్ ఇంటర్వ్యూ

జ్యోతిష్మతి కాలేజీలో ..

కరీంనగర్‌లోని జ్యోతిష్మతి గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్, ఇంజినీరింగ్ కళాశాల కింది టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ప్రొఫెసర్లు
- అసోసియేట్ ప్రొఫెసర్లు
- అసిస్టెంట్ ప్రొఫెసర్లు

విభాగాలు: సీఎస్ఈ, ఏఐ అండ్ ఎంఎల్, సివిల్, మెక్, ఈఈఈ, ఈసీఈ, ఫార్మసీ, ఇంగ్లిష్, మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఎంబీఏ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్.

- పీడీ, అకౌంటెంట్ ఆఫీసర్, ల్యాబ్ అసిస్టెంట్, ప్రోగ్రామర్, లైబ్రేరియన్, అసిస్టెంట్ లైబ్రేరియన్, సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్స్, ఆఫీస్ మేనేజర్, ఆఫీస్ అసిస్టెంట్లు, స్టెనోగ్రాఫర్, అకౌంటెంట్, వార్డెన్లు, ఎలక్ట్రీషియన్.

అర్హత: పోస్టును అనుసరించి పదో తరగతి, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ. **